## పేజీ కథ

# ది రేప్

**- స్వాతి**

**ఒక శాసన సభ్యుడి తమ్ముడు.. రేఖ అనే ఒక ఉపాధ్యాయినిని... రేప్ చేసాడని పత్రికలూ, ప్రతిపక్ష సభ్యులూ, విద్యార్థులూ ఉద్యమం ప్రారంభించారు.**



శాసనసభ్యుని తమ్ముడు నిజంగానే రేఖ అనే అమ్మాయిని కిడ్నాప్‌చేసి రేప్‌చేసాడు.

శాసనసభ్యుడు పాలకపక్షం వ్యక్తి!

.గూండా అయి ఎమ్మెల్యే అయ్యాడో, ఎమ్మెల్యే అయి గూండాఅయ్యాడో గానీ ప్రజలు శాసనసభ్యుణ్ని ముద్దుగా 'గూండా' అని పిలుచుకుంటారు!

శాసనసభ్యుని తమ్ముడి విషయమైతే చెప్పక్కర్లేదు. వాడు మరో పెద్ద 'గూండా!! అన్నగారి అండతో వాడు చేయని ఘోరాల్లేవు!

రేఖ మాత్రం అందర్లా వూర్కోలేదు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విషయం పత్రికల్లో కెక్కింది. ఆమెకు విద్యార్థులూ ప్రతిపక్ష సభ్యులూ మద్దతు పలికారు.

పోలీసులు అతన్ని అరెస్టుచేస్తే న్యాయస్థానం బెయిల్ మీద వదిలిపెట్టింది! ఈ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇంతకంటే జరిగేదేమీ ఉండదనీ... కోర్టులో... గాడిదను గుర్రానిగా - గుర్రాన్ని గాడిదగా చూపించటం చాలా తేలికనీ - సదరు ఎమ్మెల్యే... తమ్ముడికి ధైర్యం చెప్పాడు!

ఈ గొడవ జరుగుతున్న సమయంలోనే.. ఎమ్మెల్యే ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటుచేసి విలేఖరులను పిలిపించాడు!

ప్రజలైనా, ప్రతిపక్షం వారయినా.. తమ ప్రత్యర్థులయినా ఆరోపణలు చేస్తున్నప్పుడు అవి నిజమైనా ఖండించకపోతే... ప్రజలు నమ్మేస్తారు! - ఖండిస్తే ప్రజలు గందరగోళంలో పడ్తారు.

విలేఖరులను దువ్వి అంతా అబద్ధమని వ్రాయించవచ్చని ఆయన ధీమా.

ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అంతా అబద్ధ మన్నాడు!

తన రాజకీయ ప్రత్యర్థులు కావాలని తన ఫ్యామ్లీని ఇరికించారన్నాడు!

"నా తమ్ముడేమిటీ. రేప్ చేయడమేమిటీ. వాడు లక్ష్మణుడు!" అంటూ సర్టిఫికేట్ కూడా ఇచ్చాడు.

విలేఖరులు ఆసక్తిగా చూశారు.

"రేఖ నా రాజకీయ శత్రువు సూర్యనారాయణ ఉంపుడుకత్తె! మీకు తెలుసా! సూర్యనారాయణే... నా పరువు తీయటానికి రేఖతో నాటకమాడిస్తున్నట్టున్నాడు."

విలేఖరులు నోరు తెరిచారు.

"అన్యాయమండీ!.... మీ రాజకీయాలకు ఆమెను బలిపశువుచేయటం..." ఒక విలేఖరి అడ్డుపడ్డాడు.

ఎమ్మెల్యే ఆ విలేఖరి మాటను సీరియస్‌గా తీసుకోలేదు! నవ్వుతూ అన్నాడు. "ఆఫ్ ద రికార్డ్ మీకో విషయం చెప్పనా?" విలేఖరులు ముందుకు జరిగారు.

"రేప్‌చేయడానికి ఎంతో ధైర్యం కావాలి! మీ రొప్పుకుంటారో లేదో గానీ, నా దృష్టిలో - రేప్ చేసేవాడే... హీరో.... అసలు సిసలు మగతనం వున్నవాడు!"

కొందరు విలేఖరులు నవ్వారు!

కొందరు విస్తుపోయారు!

కొందరు అసహనంగా ఫీలయ్యారు!

రేఖపై సానుభూతి చూపిన విలేఖరి మాత్రం - చివాలున లేచి - "మీ అమ్మాయి హీరోయిన్‌గా - నేనో హీరోనై డ్యూయెట్లు పాడాలని వుందండీ!" అంటూ చరచరా హాల్లోంచీ బయటకి వెళ్ళిపోయాడు.

తెరిచిన సదరు ఎమ్మెల్యే నోరు... . తెరిచినట్లే వుండిపోయింది!

✡ ✡ ✡